క్లుప్తంగా

క్రీడా దుస్తుల పంపిణీ



దొడ్జెబాల్ సీనియర్ జట్లతో వ్యాయామ ఉపాధ్యాయులు

ఆదోని సెంట్రల్: ఆదోని పట్టణంలోని దొడ్జెబాల్ సీనియర్ నేషనల్ పురుషులు, మహిళల జట్లకు క్రీడాదుస్తులను మంగళవారం దొడ్జెబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కంబిరెడ్డి, సెక్రటరీ సాబీర్ అహ్మద్ పంపిణీ చేశారు. స్థానిక అక్షరశ్రీ పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. మహారాష్ట్రలోని ఎల్లోరాలో ఈ నెల 27 నుంచి 29 వరకు జరుగనున్న జాతీయస్థాయి క్రీడాపోటీల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు. పోటీలలో ఆంధ్రప్రదేశ్ జట్లు విజయం సాధించాలని అభిలాశించారు. అసోసియేషన్ సభ్యులు సునీల్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, రాజేంద్ర భూపాల్‌రెడ్డి, భరత్‌షా సోమశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన కార్యక్రమానికి విరాళం



దాతలకు స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేస్తున్న దృశ్యం

కౌతాళం: మండల పరిధిలోని ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్న స్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి సోమవారం భక్తులు రూ.80 వేలు విరాళంగా అందజేసినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వాణి, ట్రస్టు బోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్ తెలిపారు. ఆదోని వాస్తవ్యులు మంగమ్మ కుటుంబ సభ్యులు విరాళాన్ని ఆలయ కార్యాలయంలో అందజేసినట్లు తెలిపారు. ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం దాతలచే స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేయించి స్వామి వారి తీర్థప్రసాదాలు, పూలమాల, శేష వస్త్రాలు, లడ్డూలు, బాండు, ఫొటోను అందజేశారు. భక్తులు విరివిగా విరాళాలు అందజేసి ఆలయ అభివృద్ధికి పాటుపడాలని వారు కోరారు. ఆలయ అర్చకుడు లోకరాజు ఉన్నారు.

అనాథ పిల్లలకు ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న జంగమ సంఘం నాయకులు

ఆదోనిఅర్బన్: హాలహర్వి మండలంలోని బాపురం గ్రామానికి చెందిన సమంగమ సమాజానికి చెందిన అనాథ పిల్లలకు మంగళవారం ఆదోనిలోని జంగమ కార్యాలయంలో ఆర్థిక సాయం అందజేశారు. కర్నూలు జిల్లా జంగమ సమాజ సేవా సంఘం గౌరవాధ్యక్షుడు ఎర్రిస్వామి చేతులమీదుగా రూ.41,116 అందజేస్తూ, ఆ డబ్బును పిల్లల పేరిట బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తున్నట్లు చెప్పారు. జంగమ సంఘం నాయకులు తంగరడోణ పరమేశ్వరయ్య, కుంటనహాల్ మంజునాథస్వామి, ఆదోని డివిజన్ జంగమ సంక్షేమ సంఘం అధ్యక్షులు పురుషోత్తం, శివకుమార్, ఎం.కే బసవరాజు, విజయ్‌కుమార్‌స్వామి పాల్గొన్నారు.

కరువు ప్రాంతంగా గుర్తించాలి

ఆదోనిరూరల్: ఆదోని డివిజన్‌ను కరువు ప్రాంతంగా గుర్తించాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి దేవిశెట్టి ప్రకాష్, జిల్లా మైనార్టీ పట్టణాధ్యక్షుడు ఎండీ నూర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం ముందు రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆదోని డివిజన్ పరిసర ప్రాంతాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటలు ఎండిపోయాయన్నారు. పంటల సాగు కోసం పెట్టిన పెట్టుబడులు కూడా అందే పరిస్థితి లేదని వాపోయారు. రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ముందుకు రావాలని కోరారు. ఎకరానికి రూ.30 వేలు చొప్పున పంట నష్ట పరిహారం అందించి ఆదుకోవాలన్నారు. కాంగ్రెస్ నాయకులు బి.తాయన్న, ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షులు జయరాం, నెట్టేకల్ హనుమంతు, నెట్టేకల్ నాగరాజు, యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఖలందర్, మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు హుసేన్‌బాషా పాల్గొన్నారు.

చిరుతపై తిరగబడిన ఆవు

కోసిగి: మండల కేంద్రానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఆదోని రోడ్డులో పీకలగట్టు రాముడుకు చెందిన పొలంలో సోమవారం రాత్రి చిరుత ఆవుదూడపై దాడి చేయగా పెద్ద ఆవు ఎదురుదాడికి దిగింది. వివరాలు.. రైతు రాముడు తన పొలం వద్ద నాలుగు ఆవులు కట్టి ఉంచి రాత్రి అక్కడే నిద్రించాడు. అర్ధరాత్రి చిరుత వచ్చి ఆవు దూడపై దాడి చేసి మెడ పట్టుకుంది. ఆవులు గట్టిగా అరవడంతో నిద్రలేచిన రాముడు చిరుతను చూసి భయంతో అక్కడున్న చెట్టు ఎక్కి తలదాచుకున్నాడు. పక్కనున్న పెద్ద ఆవు తాడు తెంచుకుని చిరుతపై ఎదురు దాడికి దిగింది. దీంతో చిరుత దూడను వదిలేసి వెళ్లింది. దూడ మెడపై గాట్లు పడ్డాయని కొన ఊపిరితో బయట పడిందని రాముడు తెలిపారు. ఆ ప్రాంతంలో రాత్రి వేళ చిరుత సంచారం అధికమైందని, సంబంధిత అధికారులు చిరుతలను బంధించి అడవిలోకి తరలించాలని స్థానిక రైతులు కోరుతున్నారు.

వైభవంగా విజయదశమి ఉత్సవాలు

- అట్టహాసంగా రావణ దహన కార్యక్రమం
- జై శ్రీరామ్ నామస్మరణతో మార్మోగిన మైదానం
- పండగలు సమైక్యతకు ప్రతిబింబాలు
- ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదన్



రథోత్సవం ముందు కోలాటం ఆడుతున్న మహిళలు



ఆదోని మున్సిపల్ క్రీడా మైదానంలో కొలువుదీరిన దుర్గామాత

ఆదోనిఅర్బన్: దసరా పండగను పురస్కరించుకుని తొమ్మిది రోజులపాటు దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాలను భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. 10వ రోజు సోమవారం విజయదశమి వేడుకలను ఆదోని పట్టణంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది. శమీ వృక్షానికి ప్రత్యేక పూజలు చేశారు. మున్సిపల్ మైదానంలో, ఫారెస్ట్ లైన్ అంబాభవానీ ఆలయ ఆవరణలో రావణ, కుంభకర్ణ ప్రతిమల దహనోత్సవ కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. అలాగే కిలిచిన్‌పేట అంబాభవానీ ఆలయం వద్ద రథోత్సవం జరిగింది. ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. దాదాపు వంద అడుగుల దూరంలో వేదిక వద్ద ఏర్పాటు చేసిన రామబాణాన్ని దసరా శరన్నవరాత్రోత్సవాల ఉత్సవ కమిటీ పెద్దలు, పట్టణ ప్రముఖులతో కలిసి వెలిగించారు. దీంతో రావణ, కుంభకర్ణ ప్రతిమలకు నిప్పు పెట్టగా నిమిషాల వ్యవధిలో దహనమయ్యాయి. ఈ సందర్భంగా కాంతులు విరజిమ్మే బాణాసంచాలు కనువిందు చేశాయి. మైదానమంతా జై శ్రీరామ్ నామస్మరణతో హోరెత్తింది. ఉత్సవ కమిటీ వారు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. మహిషాసుర సంహారం నాటకం, నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. చిన్నారుల ప్రదర్శనలు తిలకించిన ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి వారికి ప్రోత్సాహక బహుమతులను అందించారు. నాయకులు, ప్రముఖులు, ఉత్సవకమిటీ సభ్యులు చంద్రకాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, విట్టా రమేష్, విక్రమ్, రామలింగయ్యయాదవ్, డీఎస్పీ శివనారాయణస్వామి పాల్గొన్నారు.

పండగలు సమైక్యతకు ప్రతిబింబాలు

సాంప్రదాయబద్ధంగా నిర్వహించుకునే పండగలు సమైక్యతకు ప్రతిబింబాలని ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి అన్నారు. మున్సిపల్ మైదానంలో ఆయన మాట్లాడుతూ ఏడాదికొకసారి వేలాది మంది ఒకచోట చేరుకొని పండగ శుభాకాంక్షలు చెప్పుకోవడం తనకెంతో ఆనందం కలిగిస్తోందన్నారు. ఉత్సవాల్లో అన్నివర్గాల వారు పాల్గొనడంతో సమైక్యత బలపడుతుందన్నారు.

ఘనంగా నిమజ్జనోత్సవం

నవరాత్రి ఉత్సవాల సందర్భంగా పట్టణంలో కొలువుదీరిన అమ్మవారి విగ్రహాల నిమజ్జనోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. పట్టణంలో 22 చోట్ల కొలువుదీరిన అమ్మవారి విగ్రహాలను పురవీధులగుండా శోభాయాత్ర నిర్వహించారు. చిన్నహరివాణం సమీపంలోని వినాయక ఘాట్ వద్ద విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు, స్వకుళసాలె సమాజ్ సంఘం సభ్యులు, ఆయా కాలనీ మండప నిర్వాహకులు పాల్గొన్నారు.

భారీ బందోబస్తు

దసరా శరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం రావణ, కుంభకర్ణ ప్రతిమల దహన కార్యక్రమంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ శివనారాయణస్వామి ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించారు. అలాగే అమ్మవారి విగ్రహాల శోభాయాత్ర, నిమజ్జనోత్సవం వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు. సీఐలు విక్రమసింహా, శ్రీనివాసనాయక్, నరసింహారాజు, ఎస్ఐలు విజయలక్ష్మి, చిన్న పీరయ్య, సిబ్బంది తదితరులు బందోబస్తును పర్యవేక్షించారు.



రావణ దహన కార్యక్రమాన్ని వీక్షించేందుకు వచ్చిన ప్రజలు



దహనానికి సిద్ధం చేసిన రావణ, కుంభకర్ణ ప్రతిమలు



అమ్మవారి విగ్రహాన్ని నిమజ్జనానికి తరలిస్తున్న ఉత్సవసమితి సభ్యులు

ముగిసిన దసరా వేడుకలు



మంత్రాలయంలో దుర్గామాతను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి,



మదిరెలో ఊటగనూర తాత పల్లకీ మహోత్సవంలో పాల్గొన్న బాలికలు



కౌతాళంలో పూజలందుకుంటున్న చాడేశ్వరి దేవి



కందుకూరులో ప్రత్యేక అలంకరణలో శాంభవీ దేవి



కోసిగిలో పూజలందుకుంటున్న చాడేశ్వరీ దేవి



కౌతాళంలో జమ్మిచెట్టుకు పూజలు చేస్తున్న భక్తులు,



ఊరేగింపులో దప్పు వాయిస్తున్న మహిళ

మంత్రాలయం: దసరా పండుగ వేడుకలను మంత్రాలయంలో వైభవంగా నిర్వహించారు. శ్రీ రాఘవేంద్ర స్వామి మఠంలో పీఠాధిపతి శ్రీ సుభుదేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచి రాఘవేంద్రస్వామి మూలబృందావనం నిర్మల్య విసర్జన, ఫల, పుష్ప,క్షీరాభిషేకాలు చేపట్టారు. గ్రామ దేవత మంచాలమ్మ, పాతవూరులో వెలసిన వేంకటేశ్వర స్వామికి మహా మంగళహారతులిచ్చారు. సోమవారం రాత్రి శ్రీమఠంలో శమీ వృక్షానికి, ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాతవూరులో వెలసిన మారికాంబ దేవాలయం వద్ద సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య, మల్లికార్జున, గోరుకల్లు కృష్ణస్వామి, జనార్దన్ రెడ్డి గ్రామస్థుల నేతృత్వంలో, రాంపురం గ్రామంలో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత వై.ప్రదీప్‌రెడ్డి సమక్షంలో శమీ వృక్షానికి పూజలు చేశారు. మారికాంబ, మారెమ్మవ్వలకు హారతుల అనంతరం ఒక్కరికొక్కరు బన్ని ఇచ్చిపుచ్చుకుని దసరా శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

మంత్రాలయం: దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు విజయదశమి వేడుకలను మంత్రాలయంలో వైభవంగా నిర్వహించారు. ఆర్యవైశ్య కల్యాణ మండపంలో కొలువుదీరిన దుర్గామాతను ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పూజలందుకున్న దుర్గామాత విగ్రహాన్ని సోమవారం రాత్రి ట్రాక్టర్‌లో కొలువుంచి స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపం నుంచి తుంగభద్ర నది వరకు ఊరేగింపు నిర్వహించారు. ఆర్యవైశ్య యువకులు, యువతులు, మహిళలు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. తుంగభద్ర నది తీరంలో దుర్గామాత అమ్మవారికి పూజలు నిర్వహించి నిమజ్జనం చేశారు. భక్తులకు, ఆర్యవైశ్యులకు జీపీఎస్ రెసిడెన్సీ నిర్వాహకులు అరవింద్, నాగవేణి అన్నదానం చేశారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు నారాయణశెట్టి, వెంకటేష్‌శెట్టి, ప్రహ్లాదయ్య, వేణుగోపాల్, బసవరాజు, శశికాంత్, సూరి, లక్ష్మయ్య, వీరేష్, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

కౌతాళం: మండల కేంద్రంతో పాటు హాల్వి, కామవరం, ఉరుకుంద, కుంటనహాల్, ఉప్పరహాల్, బాపురం, ఎరిగేరి, చిరుతపల్లి, సుళేకేరి, నదిచాగి గ్రామాల్లో దసరా ఉత్సవాలు ఘనంగా జరిగాయి. కౌతాళంలో అమ్మవారిని పల్లకీలో ఉంచి పురవీధుల గుండా ఊరేగించారు. జమ్మి చెట్టుకు మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కుబడులు తీర్చుకున్నారు. 9 రోజుల పాటు నిర్వహించిన జగన్మాతదేవి పురాణాలు, శరన్నవరాత్రి ఉత్సవాలు మహామంగళ హారతి కార్యక్రమంతో ముగిశాయి. విజయదశమి వేడుకల సందర్భంగా దేవి ఆలయాలను నిర్వాహకులు విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. సోమవారం రోజు కౌతాళం కొన్ని ప్రాంతాల్లో మాత్రమే పండుగ నిర్వహించగా మంగళవారం రోజు అధికంగా దసరా పండుగను జరుపుకున్నారు. చౌడేశ్వరి ఆలయంలో వెలసిన చౌడేశ్వరిదేవి, రౌడూరు పాలిమేరలో వెలసిన ఆదిబసవేశ్వర ఆలయంలోని దుర్గాదేవి ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. అర్చకులు జమ్మిచెట్టుకు ప్రత్యేక పూజలు చేపట్టి అనంతరం కాళికదేవి ఉత్సవం నిర్వహించారు. మేళిగనూరులో వెలసిన రామలింగేశ్వర స్వామి ఆలయంలో, ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయంలో, బుదుములదొడ్డి ఆంజినేయస్వామి ఆలయంలో దసరా ఉత్సవాలు వైభంగా జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో స్వామివార్లను దర్శించుకున్నారు.

కోసిగి: మండలంలోని విజయదశమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కోసిగి ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో వెలసిన భీరప్ప స్వామి పల్లకోత్సవం ఘనంగా నిర్వహించారు. అలాగే కాళికా దేవి, ఎల్లమ్మ దేవి, సత్యదుర్గాంభిక దేవి, గ్రామ దేవతలు మారెమ్మ దేవి, లక్ష్మమ్మ దేవిలకు ప్రత్యేక పూజలు చేశారు. కడపాళెం తొగట వీరక్షత్రీయుల సంఘం అధ్యక్షుడు ఓంప్రకాష్ ఆధ్వర్యంలో అమ్మవారికి హారతులు పట్టారు. భక్తులు నైవేద్యం, నారికేళాలు సమర్పించి పూజలు చేసుకున్నారు. సాయంత్రం జమ్మి చెట్టుకు పూజల అనంతరం పెద్దలకు పాదాభివందనాలు చేసి ఆశీర్వాదం తీసుకున్నారు. కందుకూరు గ్రామంలో శాంభవీ దేవి ఆలయంలో ఆలయ అర్చకులు మల్లికార్జున స్వామి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ గావించి పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో భక్తులచే హోమాలు నిర్వహించారు. హోమ పూజల్లో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బెట్టన గౌడ, జడ్పీటీసీ సభ్యురాలు పవిత్ర పాటిల్, కడపాళెం చౌడేశ్వరి దేవి ఆలయ కమిటీ బృందం పాల్గొన్నారు.

30న వాల్మీకి మహర్షి విగ్రహావిష్కరణ

మంత్రాలయం: ఈ నెల 30వ తేదీన మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన వాల్మీకి మహర్షి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి హాజరుకావాలని కోరుతూ వాల్మీకి నేత డి.సి.తిమ్మప్ప ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, టీటీడీ పాలక మండలి సభ్యుడు వై.సీతారామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు వై.ప్రదీప్‌రెడ్డి, జి.భీమారెడ్డిలను ఆహ్వానించారు. వాల్మీకి సోదరులకు ఎల్లప్పుడు అండగా ఉంటామని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి అన్నారు. వైస్ ఎంపీపీ పులికుక్క రాఘవేంద్ర, వాల్మీకి నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, సీతారామిరెడ్డిని ఆహ్వానిస్తున్న వాల్మీకి నాయకులు

వ్యవసాయానికి నిరంతర విద్యుత్ ఇవ్వాలి



గణేకల్‌లో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలియజేస్తున్న రైతులు

ఆదోనిరూరల్: వ్యవసాయానికి తొమ్మిది గంటల విద్యుత్ స్థానంలో ఏడు గంటల విద్యుత్ సరఫరా చేయడాన్ని నిరసిస్తూ మండలంలోని గణేకల్, పెద్దతుంబళం సబ్‌స్టేషన్ల ముందు మంగళవారం సీపీఎం, రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.వెంకటేశులు మాట్లాడుతూ.. ఓ పక్క వర్షాలు లేక పంటలు ఎండిపోతుంటే మరోపక్క విద్యుత్ కోతలు పెట్టి వ్యవసాయానికి 7 గంటలు మాత్రమే విద్యుత్ కొనసాగించడం ఎంతవరకు సమంజసమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి 9 గంటల పాటు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని కోరారు. సీపీఎం మండల కార్యవర్గ సభ్యులు బి.వీరారెడ్డి, రైతు సంఘం మండలాధ్యక్షులు కె.శేఖర్, నాయకులు హనుమంతరెడ్డి, గణేకల్, కుప్పగల్, పాండవగల్, జాలిమంచి తదితర గ్రామాల రైతులు పాల్గొన్నారు.

బైకులు ఢీకొని ఒకరి దుర్మరణం



మహదేవ (ఫైల్)

కౌతాళం: కౌతాళం పోలీస్‌స్టేషన్ పరిధిలోని నదిచాగి–మేళిగనూరు గ్రామాల మధ్య సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందగా ఇద్దరు గాయపడ్డారు. ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు మండలంలోని కుంబళనూరు గ్రామానికి చెందిన శివారెడ్డి గారి మహదేవప్ప (34) కర్ణాటకలోని సింధనూరు పట్టణానికి వెళ్లి పొట్టేళ్లను కొనుగోలు చేశాడు. ఆటోలో పొట్టేళ్లను తరలించి ఆయన బైక్‌పై స్వగ్రామానికి వస్తుండగా.. కర్ణాటక రాష్ట్రం శిరుగుప్ప తాలుకా కురువళ్లి గ్రామానికి చెందిన మంజునాథ్, వినోద్‌లు హాల్వి నుంచి స్వగ్రామానికి వెళుతూ నదిచాగి వద్ద రెండు బైకులు ఢీకొన్నాయి. ప్రమాదంలో మహదేవప్ప తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం ఆదోనికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మహదేవప్పకు భార్య శంకరమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఓటు హక్కు వజ్రాయుధంతో సమానం

ఆదోనిరూరల్ : 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకుని మంచి నాయకులను ఎన్నుకోవాలని, ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని వక్ఫ్ బోర్డు చైర్మన్ నియాజ్‌అహ్మద్ అన్నారు. ఈ మేరకు మంగళవారం స్థానిక ఇంటర్నేషనల్ ఫంక్షన్ హాల్‌లో అయన అధ్యక్షతన ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన సదస్సు నిర్వహించారు. యువత ఓటరుగా నమోదు చేసుకుని వారి హక్కును వినియోగించుకుని ప్రజాస్వామ్య పటిష్టతను కాపాడాలన్నారు. ఓటుహక్కు విశిష్టత తెలుసుకోవాలని సూచించారు. మైనార్టీ నాయకులు ఖాజీ అల్తాఫ్‌హుసేన్, ఖతీబ్ జునేద్‌అహ్మద్, మనియర్ ఇలియాస్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రభాస్ జన్మదిన వేడుకలు

మంత్రాలయం: మండల కేంద్రంలోని మంత్రాలయంలో సినీ హీరో ప్రభాస్ జన్మదిన వేడుకలను ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గురురాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రాఘవేంద్ర సర్కిల్‌లో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం ప్రభాస్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. అభిమానులు పాల్గొన్నారు.

ఆగిఉన్న లారీని ఢీకొని వ్యక్తి మృతి

మంత్రాలయం: మండల పరిధిలోని కల్లుదేవకుంట గ్రామ శివారులో ఆగి ఉన్న లారీని ఢీకొని బైకిస్ట్ దుర్మరణం చెందాడు. మంత్రాలయం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన మోహన్ రాంపురం గ్రామానికి చెందిన మేఘనను పెళ్లి చేసుకున్నాడు. వీరికి రెండేళ్ల కుమార్తె ఉంది. దసరా పండుగ సందర్భంగా రాంపురం గ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళుతూ ఆగి ఉన్న లారీని ఢీకొట్టడంతో మోహన్ (25) అక్కడిక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎమ్మిగనూరు ఆస్పత్రికి తరలించారు.

గుర్రాల పారువేట అదుర్స్



విజయం సాధించిన వేమనగరి కుటుంబీకుడిని సన్మానిస్తున్న దృశ్యం

మద్దికెర: విజయదశమి పండుగ పురస్కరించుకొని సోమవారం నిర్వహించిన గుర్రాల పారువేట అశేష జనవాహిని మధ్య కనులపండువగా సాగింది. పారువేటలో వేమనగిరి యాదవరాజులు జగదీశ్‌రాయుడు విజయం సాధించారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన పెద్దనగిరి, చిన్న నగిరి, వేమనగిరి కుటుంబాలకు చెందిన యాదవ వంశీకులు రాజదుస్తులతో ఠీవిగా గుర్రాలపై కూర్చోగా, వారి వెంట ఆయుధాలు ధరించిన సైనికులు ఊరేగింపుగా గ్రామ సరిహద్దులోని రాగిమాను కట్ట వద్దకు వచ్చారు. గ్రామానికి 3 కి.మీ దూరంలో బొజ్జనాయుని పేట గ్రామంలో వున్న భోగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి ప్రారంభించిన గుర్రాల పారువేటలో వేమనగిరి కుటుంబానికి చెందిన వారు ముందుగా మద్దికెరకు చేరుకొని విజయం సాధించారు. అనంతరం గ్రామ ప్రధాన రహదారిలో అశేష జనవాహిని మధ్య విజయం సాధించిన అశ్వాన్ని ఊరేగించారు. పెద్ద ఎత్తున ప్రజలు, యాదవరాజ వంశీకులు రాజన్నయాదవ్, నీలకంఠరాయుడు, జయరామరాజు, ఈశ్వర రాయుడు పాల్గొన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ రిజ్వాన్ మహమ్మద్ బందోబస్తు నిర్వహించారు.

క్రికెట్ టోర్నీ విజేత అర్ధగేరి

హాలహర్వి: దసరా సంబరాల్లో భాగంగా మండలంలోని అర్ధగేరి గ్రామంలో గత కొన్ని రోజులుగా నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ మంగళవారం ముగిసింది. టోర్నీ ఫైనల్‌లో అర్ధగేరి, గూళ్యం జట్లు తలపడ్డాయి. అర్ధగేరి జట్టు విజయం సాధించడంతో మొదటి బహుమతి రూ.10 వేలు, మొమెంటోను చింతకుంట సొసైటీ చైర్మన్ అర్ధగేరి శ్రీనివాసులు, రెండో బహుమతిని అర్జున్‌రెడ్డి అందజేశారు. వారు మాట్లాడుతూ.. క్రీడల్లో రాణించే వారికి మంచి భవిష్యత్ ఉంటుందని చెప్పారు. అర్ధగేరి సర్పంచ్ గురుదాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ తిప్పారెడ్డి, గ్రామపెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

బన్ని ఉత్సవంలో పటిష్ట బందోబస్తు



సిబ్బందికి దిశా నిర్దేశం చేస్తున్న అడిషనల్ ఎస్పీ

హొళగుంద: బన్ని ఉత్సవాల్లో జిల్లా కలెక్టర్ సృజన, ఎస్పీ కృష్ణకాంత్ ఆధ్వర్యంలో ఆదోని, నంద్యాల, కర్నూలు, డోన్, తదితర ప్రాంతాలకు చెందిన డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో కలిసి పోలీసులు, ప్రత్యేక బలగాలు, రోప్ పోలీసులు, మహిళా పోలీసులు, ఆర్మీ, సెకండ్ పార్టీలతో బందోబస్తు నిర్వహించారు. వారికి అరికెర అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో వసతి ఏర్పాటు చేశారు. బందోబస్తు నిర్వహించే సిబ్బందికి అడిషనల్ ఎస్పీ నాగబాబు, పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి పలు సూచనలిచ్చి దిశానిర్దేశం చేశారు. ఉత్సవంలో అల్లర్లకు పాల్పడే వారిని గుర్తించడానికి 100కు పైగా సీసీ, డ్రోన్, వీడియో కెమెరాలు, బాడీ ఓన్ కెమెరాలు వినియోగిస్తున్నామని, అలాగే పోలీస్ కంట్రోల్ రూం ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తామని చెప్పారు. ప్రతి ఒక్కరు అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు.